# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఉపకరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- వైఎస్సార్ కడప జిల్లాలోని బద్వేల్ నుంచి నెల్లూరు మధ్య నాలుగు వరుసల నూతన రహదారి నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.
- దివంగత నాయకులు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు నివాళి అర్పించారు.
- బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన అల్పపీడనం రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

========================

ఒత్తిడిని అధిగమించేందుకు యోగా ఉపకరిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ యోగాను తమ దైనందిన జీవితాల్లో భాగం చేసుకుంటున్నారని తెలిపారు. ఎంతో మంది విదేశీయులు మన దేశానికి వచ్చి యోగా నేర్చుకుని తమ దేశాల్లో అభ్యాసన చేస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లాలో రెండవ రోజు కొనసాగుతున్న మహానాడులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... ఈనెల 21 నుంచి నెల రోజుల పాటు యోగా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 21న విశాఖపట్నంలోని ఆర్కే బీచ్ నుంచి భీమునిపట్నం వరకు 25 కిలోమీటర్ల పరిధిలో 5 లక్షల మందితో యోగా చేయబోతున్నామని, అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది యోగా చేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వచ్చే నెలలో తల్లికి వందనం పథకాన్ని ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

దిగ్గజ నటులు, దివంగత నాయకులు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి ఈరోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళి అర్పించారు. సమాజానికి సేవ చేయడం, నిరుపేదలు, అణగారిన వర్గాల ప్రజలకు సాధికారిత కల్పించడం కోసం ఆయన చేసిన కృషిని అభినందించారు. అదే విధంగా ఎన్టీఆర్ చరిత్ర అజరామరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన మనసు, మాట, కర్మ అనే మూడు అంశాలను సమన్వయం చేసుకుంటూ.. ఏ పనినైనా త్రికరణ శుద్ధితో చేసేవారని కొనియాడారు. కాగా 1923 మే 28న ఉమ్మడి కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించిన ఎన్టీఆర్ 1949లో సినీరంగంలోకి ప్రవేశించి దాదాపు 4 దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించారు. ఆ తరువాత రాజకీయరంగ ప్రవేశం చేసి 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజాసేవలో తెలుగు ప్రజల మన్ననలను పొందారు. ఆయన జయంతిని ప్రభుత్వం ఈరోజు రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోంది.

========================

వైఎస్సార్ కడప జిల్లాలోని బద్వేల్ నుంచి నెల్లూరు మధ్య నాలుగు వరుసల నూతన రహదారి నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈరోజు న్యూ ఢిల్లీలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 3 వేల 653 కోట్ల రూపాయలతో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు ద్వారా కృష్ణపట్నం ఓడరేవుతో కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాలను అనుసంధానం చేయవచ్చని కేంద్ర సమాచార, ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

========================

“ఆపరేషన్ సిందూర్” వివరాలను వెల్లడించి ఉగ్రవాదం పట్ల భారతదేశపు వైఖరిని తెలియజేసేందుకు 59 మంది పార్లమెంట్ సభ్యులతో కూడిన అఖిల పక్ష బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్నాయి. బీజేపీ ఎంపి రవిశంకర్ ప్రసాద్ నేతృత్వంలోని ఒక బృందం యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలలో పర్యటిస్తోంది. అందులో భాగంగా ఈరోజు పారిస్ లోని ఫ్రెంచ్ జాతీయ అసెంబ్లీలో పార్లమెంటు సభ్యులను కలిశామని ఆ బృందంలోని సభ్యురాలు, రాజమహేంద్రవరం ఎంపి దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆ దేశ పార్లమెంటేరియన్లు ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలను పునరుద్ఘాటించారని, ఉగ్రవాదంపై భారతదేశం చేస్తున్న పోరాటానికి తమ మద్దతును ప్రకటించారని పురందేశ్వరి సామాజిక మాధ్యమంలో తెలియజేశారు.

విరామం

========================

రాష్ట్రంలోనూ.. కేంద్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలో ఉండటంతో ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల సమన్వయంతో కూటమి ప్రభుత్వ పాలన సమర్ధవంతంగా జరుగుతోందన్నారు. వైఎస్సార్ కడప కడప జిల్లాలోని చెర్లోపల్లిలో జరుగుతున్న మహానాడులో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఈరోజు ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి సమస్యలకు పరిష్కారం చూపామని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

========================

రానున్న ఖరీఫ్ సీజన్ దృష్ట్యా కేంద్ర మంత్రివర్గం 14 రకాల పంటల కనీస మద్దతు ధరలను పెంచుతూ ఈరోజు నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా క్వింటాల్ ధాన్యం మద్దతు ధరను 69 రూపాయల మేర పెంచింది. ఈ పెంపుతో క్వింటాల్ ధాన్యం

మద్దతు ధర 2 వేల 369 రూపాయలకి చేరింది. అలాగే రాగులు క్వింటాల్ 596 రూపాయలు, పత్తి 589 రూపాయలు, నువ్వులు క్వింటాల్ ధర 579 రూపాయల చొప్పున పెంచింది.

==========================

జూన్ మాసానికి సంబంధించి ఎన్.టి.ఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ సజావుగా జరగాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో మే 31న శనివారం పింఛన్ల పంపిణీ చేయాల్సి ఉందని, కావున 30వ తేదీ నాటికి డబ్బులు సిద్ధం చేసుకోవాలని ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు. 31వ తేదీ శనివారం సాయంత్రంలోగా నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

==========================

ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ అవగాహనా కార్యక్రమాలు జూన్ 15 నుండి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ నేపధ్యంలో పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగమంతా సిద్ధం కావాలని జూన్ 14వ తేదీ నాటికి గిరిజనులకు కావలసిన అవసరాలను గుర్తించి నివేదిక సిద్ధం చేసి, ధ్రువ పత్రాలను జారీ చేయాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల నిర్వహణ పట్ల సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్, ధర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను త్రికరణ శుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు.

==========================

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించాయని విశాఖ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో నిన్న ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోందని.. ఇది ఉత్తర దిశగా కదులుతూ రాబోయే 24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

==========================
==========================